క్లుప్తంగా

రైతులందరికీ రుణమాఫీ చేయాలి



ఖలీల్‌వాడి: గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలోని రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు బ్యాంకులలో తీసుకున్న పంట క్రాప్, బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న లోన్‌లను మాఫీ చేయాలన్నారు. నాయకులు విఠల్ గౌడ్, రఘురాం, రంజిత్, గంగాధర్ ఉన్నారు.

నిబంధనలు సరిచేయాలి

ఖలీల్‌వాడి: రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ కోసం ఇచ్చిన మార్గదర్శకాల వల్ల అర్హులైన పేద, మధ్యతరగతి రైతులు రుణమాఫీకి దూరమయ్యే పరిస్థితులు ఉన్నాయని, వాటిని సవరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. నగరంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల దగ్గర, రైతుమిత్ర గ్రూపుల వద్ద లేదా ఇతర సంస్థల్లో రైతులు తీసుకున్న రుణాలను చెల్లించేది లేదన్నట్టుగా నిబంధన ఉందని, దీనిని సవరించాలన్నారు. ప్రభుత్వం రైతులందరి రుణాలను మాఫీ చేసేలా నిబంధనలను విడుదల చేసి జీవో ఇచ్చినప్పుడు మాత్రమే రైతులు సంతృప్తి చెందుతారన్నారు.

నేడు ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద ధర్నాలు



ఖలీల్‌వాడి: ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం నేడు(గురువారం) ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు ఆశ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నూర్జహాన్ పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం డీఎంహెచ్‌వో తుకారంరాథోడ్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తల సమస్యలపై శాసనసభలో చర్చించలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ధర్నాలో ఆశ వర్కర్లు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యూనియన్ సభ్యులు రేణుక, సుకన్య, రేవతి, అనిత, గీత, గౌరీ, సుమలత ఉన్నారు.

కులాస్‌పూర్‌లో ఇంటింటి సర్వే



మోపాల్: మండలంలోని ముదక్‌పల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది బుధవారం కులాస్‌పూర్ గ్రామంలో ఇంటింటి నిర్వహించారు. ఈసందర్భంగా సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ ఎవరికైనా జ్వరం లక్షణాలు ఉంటే వెంటనే వైద్యసిబ్బందిని సంప్రదించాలని ప్రజలకు తెలిపారు. పరిసరాల శుభ్రత, దోమల లార్వా, నీటి నిల్వ, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సుశాంత్, వెంకటేష్, ఆశిష్‌రాజ్, ప్రత్యూష మాట్లాడుతూ.. వానాకాలం దృష్ట్యా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం సబ్ సెంటర్‌లో వైద్యశిబిరం నిర్వహించారు. సిబ్బంది భూలక్ష్మీ, గంగాధర్, రాజేంద్ర, అనురాధ, పద్మ, వనజ, వినోద, సుప్రియ, రాజ్యలక్ష్మీ, సవిత, సుమలత, సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి



సిరికొండ: సహారా ఇండియా కంపెనీలో పొదుపు చేసిన వారికి కేంద్ర ప్రభుత్వం డబ్బులను చెల్లించి బాధితులను ఆదుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు కోరారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు 12 కోట్ల మంది సహారా ఇండియా కంపెనీలో పొదుపు చేసుకున్న రూ.86వేల కోట్లను కేంద్ర ప్రభుత్వం చెల్లించకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. వెంటనే ఆ డబ్బులను బాధితులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ కేవలం రూ.500 కోట్లు మాత్రమే చెల్లించారని, మిగతా డబ్బులను సైతం వెంటనే చెల్లించాలన్నారు. నాయకులు పద్మ, బాలయ్య, మార్క్స్, సంజీవ్ పాల్గొన్నారు.

నియామకం



నిజామాబాద్‌నాగారం: లయన్స్ క్లబ్ ఆఫ్ నేత పూర్వాధ్యక్షుడు సకినాల తులసిదాస్ లయన్స్ జోన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా గవర్నర్ నగేష్ పంపటి బుధవారం తులసీదాస్‌కు నియామకపత్రం అందజేశారు. నియామకంపై క్లబ్ ప్రతినిధులు కైరంకొండ మురళి, ధర్మరాజు, పుల్గం హన్మాండ్లు, గంగరాజు, గురుచరణ్, లక్కవత్రి దేవిదాస్ హర్షం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో తొలిఏకాదశి





నిజామాబాద్, ధర్మారంలోని స్వామివార్ల మూలవిరాట్



నగరంలోని జెండా బాలాజీ ఆలయం వద్ద భక్తుల రద్దీ

సాక్షి నెట్‌వర్క్: నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో ప్రజలు బుధవారం తొలి ఏకాదశి పండుగను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు స్థానిక ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నగరంలోని జెండాగల్లీలో గల జెండా బాలాజీ ఆలయంలో ఉదయం నుంచే స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. స్వామివారికి అభిషేకం, అర్చన, విశేష పూజలు నిర్వహించారు. భక్తమండలి ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అఖండ విష్ణు సహస్ర పారాయణం నిర్వహించారు. శివాజీ నగర్ వద్ద గల శ్రీకృష్ణ గీత మందిరంలో ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, అర్చన, విశేష పూజలు చేశారు. శ్రీకృష్ణ అష్టోత్తర శతనామావళి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం భజన, మహా హారతి కృష్ణ భగవానుడి పవళింపు సేవ నిర్వహించారు. దత్త మందిరంలో తొలి ఏకాదశి సందర్భంగా ఆల అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, హారతి అర్చన విశేష పూజలు నిర్వహించారు. కోటగల్లీలోని మార్కండేయ ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వా మి వారికి సుప్రభాత సేవ, విశేష పూజలు నిర్వహించారు. శబరిమాత భజన మండలి హరిహరుల సంకీర్తన భజన నిర్వహించారు. నాందేవాడలోని విఠలేశ్వర మందిరంలో బ్రహ్మపురిలోని విఠలేశ్వర మందిరంలోనూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. డిచ్‌పల్లి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ప్రజలు తొలిఏకాదశి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో గల శ్రీదేవి శ్రీభూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. తొలిఏకాదశి రోజు పలువురు భక్తులు ఉపవాసాలు చేసి మరుసటి రోజు ఉపవాస దీక్ష విరమించనున్నారు. మోపాల్ మండలంలోని సిర్‌పూర్, ముదక్‌పల్లి గ్రామాల సరిహద్దులోగల నంది శివాలయంలో హిమాలయాల నుంచి వచ్చిన అఘోరాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా స్వయంభు దైవక్షేత్రాలను సందర్శిస్తున్నామని, అందులోభాగంగా ఇక్కడికి వచ్చినట్లు వారు తెలిపారు.



జెండా బాలాజీ ఆలయంలో హారతి తీసుకుంటున్న భక్తులు..



ధర్మారం(బి)లోని వేంకటేశ్వరాలయంలో..



నగరంలోని మార్కండేయ ఆలయంలో..



బర్థిపూర్‌లోని హరిహర క్షేత్రంలో..



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



మోపాల్ మండలంలోని శివాలయం వద్ద అఘోరాలు

సంక్షిప్తం

నోట్‌బుక్స్ పంపిణీ



నిజామాబాద్‌నాగారం: నగరంలోని సతీష్‌నగర్‌లో గల అభయ వీర హనుమాన్ మందిరంలో బుధవారం సరస్వతి విద్యామందిర్‌లోని పేద విద్యార్థులకు శ్రీరామ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం, నోట్‌బుక్కులు, పెన్నులు అందజేశారు. సంస్థ సభ్యులు శ్రీనివాస్, రామ్మోహన్, టీఎస్ వ్యాస్, దయాకర్ ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్ గ్రామానికి చెందిన షాదుల్లా ఇటీవల మృతి చెందాడు. దీంతో మృతుడి మిత్రులు బుధవారం బాధిత కుటుంబానికి రూ.37,500 ఆర్థిక సహాయం అందజేశారు. చింత మహేష, మహిపాల్, పెద్ది రాజు, ప్రవీణ్ కుమార్, గంగాధర్ పాల్గొన్నారు.

నేడు రుణమాఫీ సంబురాలు

డిచ్‌పల్లి: పంట రుణమాఫీ కార్యక్రమం ప్రారంభం, లబ్ధిదారులతో సీఎం ముఖాముఖి సంభాషణ సందర్భంగా నేడు (గురువారం) మెంట్రాజ్‌పల్లి రైతువేదికలో సంబురాలు నిర్వహించనున్నట్లు ఏవో రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్షంగా చూడవచ్చన్నారు. సంబురాలను రుణమాఫీ లబ్ధిదారులు (రైతులు) అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నిజామాబాద్‌రూరల్: గుండారం రైతువేదిక వద్ద నిర్వహించనున్న రుణమాఫీ సంబురాలకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి హాజరుకానున్నారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు, రైతులు హాజరుకావాలని కోరారు.

కుస్తీ క్రీడాకారులకు సన్మానం



నిజామాబాద్‌నాగారం: ఇటీవల హైదరాబాదులో జరిగిన రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలలో నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎస్కె నేహా, సిద్రా మెహవీన్ బంగారు పతకాలు సాధించారు. ఈసందర్భంగా వారిని, కోచ్ దేవేందర్‌ను బుధవారం జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు భక్తవత్సలం, ఫైర్ స్టేషన్ ఆఫీసర్ నర్సింగ్ రావు, జయపాల్, రాజ్‌కుమార్ సుబేదార్, సురేష్ అభినందించి, సన్మానించారు.

భవన నిర్మాణ కార్మికుడికి గాయాలు

మోపాల్: మోపాల్ మండలకేంద్రంలో ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడి బాలయ్య అనే కార్మికుడికి బుధవారం తీవ్ర గాయాలయ్యా యి. సలీ అనే వ్యక్తి తన ఇంటిపై గది నిర్మాణ పను లు చేపడుతుండగా, బోర్గాం(పి) శివారులోని గూడెం కాలనీకి చెందిన బాలయ్య పనికి వెళ్లాడు. గోడ నిర్మిస్తుండగా అదుపు తప్పి రెండంతస్తుల పైనుంచి కింద పడిపోయాడు. బాధితుడిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఎస్సై గంగాధర్‌ను వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ప్రతిభను ప్రోత్సహించడం అభినందనీయం



నిజామాబాద్‌నాగారం: విద్యార్థుల్లోని ప్రతిభను డీఎస్పీ బోనాల కిషన్ పటేల్ గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తోట రాజశేఖర్ అన్నారు. నగరంలోని ప్రగతినగర్ మున్నూరుకాపు కల్యాణ మండపంలో బుధవారం జిల్లా మున్నూరుకాపు ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను సన్మానించారు. జిల్లాకు చెందిన బొంతుల చరణ్ జెఈఈ అడ్వ్‌లో జాతీయస్థాయిలో ర్యాంకు సాధించడం గర్వనీయమన్నారు. నాయకులు అబ్బాపూర్ రవి, బుస ఆంజనేయులు, ఆకుల ప్రసాద్, బాసెట్టి సురేష్‌కుమార్, నరేష్ పటేల్, లక్ష్మణ్ పటేల్, హరిచరణ్ పటేల్, లింబాద్రి పటేల్, చిట్టి నారాయణరెడ్డి పటేల్, బాల జనార్ధన్ పటేల్, బొబ్బిలి నర్సయ్య పటేల్, రాంభూపాల్ పటేల్, రాజు పటేల్, బాలకిషన్ పటేల్ పాల్గొన్నారు.

అర్హులకే ప్రభుత్వ పథకాలు అందించాలి



నిజామాబాద్‌నాగారం: ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదులో జరిగిన అవకతవకలను సరిచేసి అర్హులైన వారికే గృహజ్యోతి, సిలిండర్‌పై సబ్సిడీ పథకం అందించాలని, ఈమేరకు కలెక్టర్, కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ న్యాలం రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజాపాలన రసీదు ఆధారంగా లబ్ధిదారులకు పథకాలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

చట్టాలపై అవగాహన



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ సమీకృత బాలుర వసతి గృహం విద్యార్థులకు బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయవాది గటడి ఆనంద్ మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. విద్యా హక్కు చట్టం తదితర వాటిపై అవగాహన కల్పించారు. క్లబ్ అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్, కోశాధికారి నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ఫలితంగానే వేతనాలు విడుదల



సిరికొండ: గ్రామ పంచాయతీ కార్మికులు చేసిన పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం వారి వేతనాలను విడుదల చేసిందని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రమేష్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేతనాల కోసం కార్మికులు చేసిన పోరాటాలు కొనియాడాలేనిదన్నారు. నాయకులు దామోదర్, సాయారెడ్డి, రమేష్, కిషోర్, ఆశిష్ పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



ఇందల్వాయి: ప్రతిఒక్కరూ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని వాయిస్ ఫర్ గర్ల్స్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనూష భరద్వాజ్ అన్నారు. ఇందల్వాయిలోని టీటీడబ్ల్యూఆర్‌జేసీలో బుధవారం వాయిస్ ఫర్ గర్ల్స్ పరిచయ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలికల సాధికారత కోసం వార్షిక ప్రాతిపదికన క్యాంపులను నిర్వహిస్తున్నామన్నారు. కౌమార దశలో ఉన్న బాలికలకు క్లిష్టమైన జ్ఞానం, జీవన నైపుణ్యాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలన అందించడం ద్వారా వారు వారి భవిష్యత్‌పై బాధ్యత వహించగలరన్నారు. ప్రిన్సిపల్ శ్యామలదేవి, పాఠశాల సిబ్బంది, వాయిస్ టీం సుమాంజలి, పింకు రోషన్, నికిత, జాహ్నవి, చైత్రిక, భార్గవి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన కళాకారులకు ఉద్యోగాలు ఇవ్వాలి



నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ ఉద్యమంలో పని చేసిన అర్హులైన కళాకారులకు ఉద్యోగాలు ఇవ్వాలని జిల్లా నిరుద్యోగ కళాకారుల అధ్యక్షుడు చిట్టిబాబు అన్నారు. జిల్లాకేంద్రంలోని గౌతంనగర్ ఎన్‌జీఓఎస్ కాలనీలో బుధవారం తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కళాకారులు ఊరూరా తిరిగి ఉద్యమ స్ఫూర్తిని రగిలించారన్నారు. అలాంటి కళాకారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యోగాలు ఇవ్వాలని అన్నారు. గత ప్రభుత్వం తమను పట్టించుకోలేదని అన్నారు. ఉమ్మడి జిల్లాలో 26ఉద్యోగాలు ఇచ్చారని, ఇతర జిల్లాలతో సమానంగా ఉమ్మడి జిల్లాలో వంద ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. నాయకులు దేగావత్ గణేష్, ఆంజనేయులు, సబావత్ గోపాల్, రమేష్, మహేందర్, సంజీవ్, డప్పు స్వామి, సద్గురు, దేవరాజ్, శ్రీనివాస్, కిష్టయ్య, రమేష్, సింగరాయపల్లి సాయిలు, శంకర్ గౌడ్, వెంకన్న, కిషన్, శ్యామ్, అశోక్, శ్రీను, రాము, అశోక్ పాల్గొన్నారు.

నేటి చిత్రం..



శ్రీనగర్‌కాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

బురదమయంగా రహదారి

నగరంలోని శ్రీనగర్‌కాలనీలో రోడ్డు మొత్తం బురదమయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై ఉన్న గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని కాలనీవాసులు కోరుతున్నారు.
–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ఘనంగా మొహర్రం పండుగ



డిచ్‌పల్లి ఖిల్లా గ్రామంలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు..



ముదక్‌పల్లిలో..

డిచ్‌పల్లి/నిజామాబాద్‌రూరల్/నిజామాబాద్ అర్బన్/మోపాల్: నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో బుధవారం పీర్ల (మొహర్రం) పండుగను కులమతాలకు అతీతంగా ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలు గ్రామాల్లో పీర్లను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అగ్నిగుండాల చుట్టూ తిరుగుతూ అసయ్‌దులా ఆటలు ఆడారు. అనంతరం పీర్లను గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. తమ ఇళ్ల ముంగిట వచ్చిన పీర్లకు పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.



మాధవ్‌నగర్‌లో..

చెరువును తలపిస్తున్న రోడ్డు



సాయిరాంనగర్ కాలనీలోని ఖాళీ ప్రదేశంలో నిలిచిన నీరు



రోడ్డుపై నిలిచిన నీటిని తొలగిస్తున్న స్థానికులు

నిజామాబాద్‌నాగారం: ఇటీవల కురిసిన వర్షాలకు నగరంలోని సాయిరాంనగర్ కాలనీ రోడ్లు జలమయంగా మారాయి. కాలనీలో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్లన్నీ నీటికుంటలు, చెరువులను తలపిస్తున్నాయి. స్థానికులు రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఖాళీ స్థలాల్లో వర్షపునీరు పెద్ద ఎత్తున నిలిచి ఉంటుంది. ఈక్రమంలో బుధవారం స్థానికులు రోడ్లపై నీటిని తొలగించడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై నీరు నిలువ ఉండకుండ చూడాలని స్థానికులు కోరుతున్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	75,100	వెండి (కిలో)	95,000
22 క్యారెట్స్	69,050		

- నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	48	70	గాజరుగడ్డ	30	50
బెండకాయ	20	40	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	25	50	దోసకాయ	15	30
దొండకాయ	10	20	ఆలుగడ్డ	30	50
బీర్నిసుకాయ	60	90	గోబిగడ్డ	35	50
కాకరకాయ	40	60	గోబిపువ్వు	35	50
వంకాయ	10	20	బీట్‌రూట్	30	50
పాలకూర	15	30	కరివేపాకు	40	60
మెంతికూర	50	80	చామగడ్డ	40	60
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	50	70
పుదీనా	50	70	చిక్కుడుకాయ	60	90
క్యాప్సికం	50	75			

- సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	భారతీయుడు-2 (తెలుగు)-9.00, 12.30, 4.00, 7.25, 10.50
స్క్రీన్-2	భారతీయుడు-2(తెలుగు) -10.00 కల్కి-2898 ఏడీ(తెలుగు) -1.30, 3.20, 7.00 కల్కి-2898 ఏడీ(తెలుగు) -6.45
స్క్రీన్-3	కల్కి-2898 ఏడీ(తెలుగు) -10.30, 1.30, 3.20, 07.00, 10.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	కల్కి-2898 ఏడీ (3డీ తెలుగు)- 11.00, 6.30 కల్కి-2898 ఏడీ(హిందీ)-2.45,10.15
స్క్రీన్-2	భారతీయుడు-2 (తెలుగు) - 11.15, 3.00, 6.45, 10.30
స్క్రీన్-3	కిల్(హిందీ) -12.15, 2.45, 9.00 భారతీయుడు - 2 (తెలుగు)- 5.15
స్క్రీన్ -4	సరఫరా (హిందీ) - 12.20, 3.40, 7.00, 10.20
దేవి	భారతీయుడు-2 (తెలుగు)
నటరాజ్	భారతీయుడు-2 (తెలుగు)
విజయ్	కల్కి-2898 ఏడీ(తెలుగు)